# ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళిక చట్టం 2013


ప్రచురణ : **దళిత స్త్రీ శక్తి**

ప్రచురణ సంఖ్య : 21

ముద్రణ : నవంబరు 2013

ప్రతులు : 2000

వెల : 15/-

అనువాదం : **ఆచార్య ఎ. సుబ్రహ్మణ్యం**
న్యాయశాస్త్ర ఆచార్యులు (విశ్రాంత)
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.



ప్రతులకు : **జి. ఝాన్సీ**
కన్వీనర్, దళిత స్త్రీ శక్తి,
ఎస్.ఆర్.టి - 95,
వీధి నెం. 3, జవహర్ నగర్,
చిక్కడపల్లి, హైదరాబాద్- 5000 20.
ఫోన్ : 040-2760 1557
ఫ్యాక్స్: 040-2760 6777

# మా మాట

అనేక తరాలుగా దోపిడీకి గురైన దళిత, గిరిజన కులాలు ఆర్థికంగా స్థిరపడడం కోసం రూపొందించబడిన చట్టం షెడ్యూల్డు కులాల/ తెగల ఉపప్రణాళికా చట్టం. ఎన్నో సంవత్సరాల నుండి ఎదురు చూసిన కల ఈ చట్టం ద్వారా నెరవేరుతుందనే ఉద్దేశ్యంతో ఈ చట్టాన్ని తీసుకురావడం కోసం మేధావులు, సంఘాలు అనేక పోరాటాలు చేసాయి. దళిత, గిరిజనులకు కేటాయించిన నిధులు కొన్ని వేల కోట్లు వారికి దక్కకుండా పోయాయనీ, చట్టం రూపంలో అయితే పగడ్బందీగా అమలవుతుందనే ఆశతో ఈ చట్టం రూపుదాల్చింది. కానీ చట్టం అయినా, పథకాలయినా, దళిత గిరిజనుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించిన దాఖలాలు లేవు, ప్రస్తుతం ఈ చట్టం కూడా అంతే.

ఈ చట్టాన్ని తెలుగులో అనువదించడానికి గల కారణం ఈ చట్టంలో ఉన్న అంశాలు, చేర్చాల్సిన అంశాలు, అమలు పరచుకోవలసిన పద్ధతులు అవగాహన చేసుకుంటే ముందుకు వెళ్లే మార్గాలు అవగతమవుతాయి. ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం, సమూహాలుగా సమస్యలు పరిష్కరించుకునే దశ నుండి మన జాతుల, తరాల అభ్యున్నతి కోసం ఆలోచించాలి. మన పిల్లల జీవితాలను బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దాలి. దళిత, గిరిజన స్త్రీల, బాలికల జీవితాలను ప్రధాన స్రవంతిలోకి తేవాలి. అందుకు ఈ చట్టాన్ని మన హక్కుగా గుర్తించి దాన్ని ఒక ఆయుధంగా మలచుకోవాలి. ఆ ఆయుధానికి మరింత పదును పెట్టాలంటే మనం జ్ఞానవంతమయి కలిసికట్టుగా పోరాడాలి.

జై భీమ్‌లతో
**దళిత స్త్రీ శక్తి**

# ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/
# గిరిజన ఉపప్రణాళిక చట్టం
# 2013

ప్రచురణ

**దళిత స్త్రీ శక్తి**

# ఆంధ్రప్రదేశ్ రాజపత్రము

**చట్టం క్రమసంఖ్య 1/2013**

## ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజన ఉపప్రణాళిక (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు మరియు వినియోగం) చట్టం 2013

విషయసూచిక

## అధ్యాయం - I

**ప్రారంభ అంశాలు**

1. చట్టం పేరు, పరిధి, అమలు, కాలం తదితరాలు.
2. నిర్వచనాలు.

## అధ్యాయం - II

**షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళికల నిధులకు మరియు పథకాలకై ప్రణాళిక రూపకల్పన, వనరుల కేటాయింపు.**

3. రాష్ట్ర ప్రణాళిక నుంచి షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికలకు నిధులు కేటాయించటం.
4. షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికలకు కేటాయించబడిన నిధుల గురించి ప్రభుత్వ శాఖలకు తెలియజేయటం.
5. షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళికల కింద పథకాలను చేర్చటం.
6. షెడ్యూల్డు కులాలు, గిరిజనుల మధ్య సమన్వాయం పెంపొందించటం.
7. సాధారణ పథకాలు షెడ్యూల్డు కులాలు, గిరిజనుల వారికి అందేట్లు చూడాల్సిన బాధ్యత.
8. షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజనుల ఉపప్రణాళిక పథకాలను రచించుకోవటం మరియు ప్రభుత్వ శాఖలు పథకాలను తయారు చేయటం.
9. వార్షిక ప్రణాళికలో చేర్చేందుకై ఉపప్రణాళికలను సమర్పించటం.

## అధ్యాయం - III

**షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజనుల ఉపప్రణాళికలను పరిశీలించటం, నిధులు కేటాయించటం మరియు ఆ ఉపప్రణాళికలను ఆమోదించటం**

10. నిర్దేశించబడిన శాఖలచే షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళిక పథకాల పరిశీలన.
11. షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజనుల ఉపప్రణాళికలకు నిధులు కేటాయింపు, తద్వారా సంబంధిత పథకాలకు తగు మొత్తాలను సమకూర్చటం.
12. నిర్దేశించబడిన సంస్థలు, శాఖల ప్రతిపాదనలు.

## అధ్యాయం - IV

**బడ్జెట్ ఏర్పాటు, పంపకం మరియు అమలు చేసే వ్యవస్థలను బలోపేతం చేయటం**

13. బడ్జెట్ కేటాయింపులు.
14. ఆర్థిక శాఖలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజనుల ఉపప్రణాళికల విభాగం.
15. బడ్జెట్ విడుదల ఉత్తర్వులు.

## అధ్యాయం - V

**వ్యవస్థీకృత ఏర్పాట్లు**

16. షెడ్యూల్డు కులాల, గిరిజనుల అభివృద్ధికై రాష్ట్రమండలి.
17. రాష్ట్ర మండలి కార్యకలాపాలు.
18. నిర్దేశిత సంస్థ మరియు నిర్దేశిత శాఖ.
19. నిర్దేశిత సంస్థ మరియు శాఖ కార్యకలాపాలు.
20. షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికల నిర్దేశిత శాఖకు పాలనాపరమైన మరియు సాంకేతిక మద్దతు.
21. శాఖా స్థాయిలో ఉపప్రణాళిక మద్దతు యూనిట్.
22. జిల్లాల్లో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక పథకాల అమలు.
23. ఖచ్చితమైన అమలు, పర్యవేక్షణలకై వ్యవస్థీకృత బలోపేతం.

## అధ్యాయం - VI

**షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక అమలులో పారదర్శకత, బాధ్యతలు**

24. పారదర్శకత మరియు బాధ్యత.
25. పారితోషికాలు మరియు శిక్షలు.
26. రాష్ట్ర శాసన సభలో వార్షిక నివేదిక.
27. నిబంధనలు రూపొందించేందుకు అధికారం.
28. సందేహాల నివృత్తికై అధికారం.

# ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజన ఉపప్రణాళిక (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు మరియు వినియోగం) చట్టం 2013

షెడ్యూల్డు కులాల మరియు గిరిజనుల అభివృద్ధిని వేగతరం చేసేందుకై, ప్రధానంగా వీరి సమానత్వ స్థాయి సాధనకై రాబోయే దశాబ్దంలో వీరి ఆర్థిక, విద్యా పరమైన మరియు మానవ అభివృద్ధిపై కేంద్రీకరించి మరియు వీరి భద్రత, సామాజిక హోదాను మెరుగుచేస్తూ, అదే విధంగా షెడ్యూల్డు కులాలు, గిరిజన ప్రజల మధ్య అంతర్గతంగా సమన్యాయం పెంపొందిస్తూ, తద్వారా వీరి అభివృద్ధిని సాధించేందుకై మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో షెడ్యూల్డు కులాల, గిరిజనుల జనాభా నిష్పత్తికి అనుగుణంగా నిధులను ప్రత్యేకంగా వీరికే కేటాయించి, షెడ్యూల్డు కులాల/ గిరిజనుల ఉపప్రణాళికలను ఏర్పరిచేందుకు మరియు వీటి పటిష్ట అమలుకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేసేందుకు సంబంధిత అంశాలను పొందుపరిచే ఉద్దేశ్యంతో ఈ చట్టం చేయబడింది.

భారత గణతంత్ర రాజ్యం అరవై మూడవ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఈ క్రింది విధంగా శాసనం చేసింది.

## అధ్యాయం - I

**1.** (1) ఈ చట్టం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజన ఉపప్రణాళిక (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపు మరియు వినియోగం) చట్టం 2013.

(2) ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా వర్తిస్తుంది.

(3) ఇది రాష్ట్ర ప్రభుత్వం రాజపత్రంలో ప్రకటించిన తేదీ నుంచి అమలవుతుంది. ఈ చట్టంలోని వివిధ సెక్షన్లు వివిధ తేదీల నుంచి అమలయ్యేట్లుగా ప్రకటించవచ్చు.

(4) ఈ చట్టం అమలులోకి వచ్చిన తేది నుంచి పది సంవత్సరాలకు రద్దవుతుంది. కానీ అలా రద్దయ్యేందుకు ముందు జరిగిన అంశాలు మాత్రం అలానే ఉంటాయి, వాటి ప్రభావం కొనసాగుతుంది. ఈ చట్టం రద్దయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ జనరల్ క్లాజెస్ చట్టం 1891 వర్తిస్తుంది. ఈ చట్టాన్ని ఒక రాష్ట్ర చట్టం ద్వారా రద్దు చేసినట్లుగా పరిగణించబడుతుంది.

**2. సందర్భానుసారంగా వేరే అర్థం వస్తే మినహా, ఈ చట్టంలో పదాల అర్థాలు:**

**(అ)** **"శాఖ"** అనగా, షెడ్యూల్డు కులాలు, గిరిజనుల సంక్షేమానికి ప్రణాళికా పథకాలు అమలుపర్చే ప్రభుత్వ శాఖ అని అర్థం.

(అ) **"అభివృద్ధిలో అంతరాలు"** అనగా, మానవ మరియు ఆర్థికపరంగా రాష్ట్ర సాధారణ అభివృద్ధి సూచికలకు పోల్చి చూసినపుడు షెడ్యూల్డు కులాల/ గిరిజనుల అభివృద్ధి స్థాయితో తేడా అని అర్థం.

(ఇ) **"సాధారణ పథకాలు"** అనగా, షెడ్యూల్డు కులాలు మరియు గిరిజనులతో సహా అన్ని సామాజిక వర్గాలకు కలిపి ప్రయోజనం కూర్చేందుకై ఉద్దేశించబడిన వార్షిక ప్రణాళికలోని పథకాలు అని అర్థం.

(ఈ)**"ప్రభుత్వం"** అనగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అని అర్థం.

(ఉ) **"షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికకై నియమిత సంస్థ"** అనగా, సాంఘిక సంక్షేమశాఖా మంత్రి ఆధ్వర్యంలోని సభ్యుల సంస్థ అని అర్థం.

(ఊ)**"గిరిజనుల ఉపప్రణాళికకై నియమిత సంస్థ"** అనగా, గిరిజనుల సంక్షేమశాఖా మంత్రి ఆధ్వర్యంలోని సభ్యుల సంస్థ అని అర్థం.

(ఋ) **"నియమిత శాఖ"** అనగా, షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజనుల ఉపప్రణాళికకు సంబంధించి గిరిజనుల సంక్షేమ శాఖ అని అర్థం.

(ౠ) **"ప్రకటన"** అనగా, ఆంధ్రప్రదేశ్ రాజపత్రంలో ప్రచురించబడిన ప్రకటన అని, 'ప్రకటించబడిన' అంటే అందుకు అనుగుణంగానూ అర్థం చేసుకోవాలి.

(ఎ) **"ఆదేశించబడిన"** అనగా, ఈ చట్టం అనుగుణంగా చేయబడిన నిబంధనల ప్రకారం ప్రభుత్వ నిర్దేశాలు అని అర్థం.

(ఏ) **"రాష్ట్ర మండలి"** అనగా, ఈ చట్టం అనుగుణంగా షెడ్యూల్డు కులాలు, గిరిజనుల అభివృద్ధికై ఏర్పాటు చేయబడ్డ రాష్ట్ర మండలి అని అర్థం.

(ఐ) **"షెడ్యూల్డు కులాలు, గిరిజనులు"** అనే పదాలకు భారత రాజ్యాంగంలో 366వ అధికరణంలో (24) మరియు (25) వ క్లాజులలో చెప్పబడిన నిర్వచనమే వర్తిస్తుంది.

(ఒ) **"షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక (SCSP)"** అనగా, షెడ్యూల్డు కులాల్లో అంతరాలను పూడ్చేందుకై రాష్ట్రమండలిచే రూపొందించబడి ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో పొందుపర్చబడిన ప్రణాళిక అని అర్థం. సాధారణ పథకాలలోని షెడ్యూల్డు కులాల కేటాయింపు కూడా దీని కిందికే వస్తుంది.

(ఓ) **"గిరిజనుల ఉపప్రణాళిక (TSP)"** అనగా, గిరిజనుల్లో అంతరాలను పూడ్చేందుకై రాష్ట్ర మండలిచే రూపొందించబడి ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో పొందుపర్చబడిన ప్రణాళిక అని అర్థం. సాధారణ పథకాలలోని గిరిజనుల కేటాయింపు కూడా దీని కిందికే వస్తుంది.

(ఔ) **"షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక నిధి"** అనగా, రాష్ట్ర మొత్తం వార్షిక ప్రణాళికలో ఈ చట్టంలోని సెక్షన్ 3 అనుగుణంగా కేటాయించబడిన భాగం అని అర్థం.

(అం) **"షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక పథకాలు"** అనగా వివిధ ప్రభుత్వ శాఖలలో పొందుపర్చబడిన షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికలోని పథకాలు అని అర్థం.

(అః) **"షెడ్యూల్డు కులాల/ గిరిజనుల నివాస ప్రాంతం"** అనగా, ఏదైన నివాస ప్రాంతంలో షెడ్యూల్డు కులాలు గానీ లేదా గిరిజనులు కానీ లేదా ఇరు వర్గాలు కలిపి గాని ఆ ప్రాంత మొత్తం ప్రజలలో 40% తగ్గకుండా ఉన్న ప్రాంతం అని అర్థం.

(క) **"ఉపప్రణాళికలు"** అనగా, షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక (SCSP) లేదా గిరిజనుల ఉపప్రణాళిక (TSP) లేదా రెండూను అని అర్థం.

(ఖ) **"షెడ్యూల్డు ప్రాంతం"** అనగా, ఆ విధంగా భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూలులోని 'సి' భాగం కింద ప్రకటించబడిన ప్రాంతం అని అర్థం.

(గ) **"షెడ్యూల్డు ప్రాంతాలకు సంబంధించిన నివేదిక"** అనగా, భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు, భాగం 'ఎ' లోని 3వ పేరా అనుగుణంగా రాష్ట్ర గవర్నర్ షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలన గురించి భారత రాష్ట్రపతికి ఇచ్చే నివేదిక అని అర్థం.

(ఘ)**"ఆంధ్రప్రదేశ్ గిరిజనుల సలహామండలి"** అనగా, భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు, భాగం 'బి'లో 4వ పేరాలో చెప్పబడిన గిరిజనుల సలహా మండలి అని అర్థం.

# అధ్యాయం - II

## రాష్ట్ర ప్రణాళిక నుంచి షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికలకు నిధులు కేటాయించడం.

**3.** రాష్ట్ర ప్రభుత్వం తన మొత్తం రాష్ట్ర వార్షిక ప్రణాళికలో కొంత భాగాన్ని షెడ్యూల్డు కులాల, గిరిజన ప్రజల నిష్పత్తికనుగుణంగా ప్రతి సంవత్సరం, నిర్దేశించబడిన పద్ధతిలో ప్రత్యేకంగా కేటాయించాలి. ఈ మొత్తం షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళిక నిధి అని పిలువబడుతుంది.

అయితే, ఈ విధంగా ప్రత్యేకంగా కేటాయించబడాల్సిన నిధి తదుపరి ఆర్థిక సంవత్సరానికి 6 నెలలు ముందుగానే నిర్ణయించబడాలి.

కానీ, పై విధంగా నిర్ణయించబడిన ఈ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళిక నిధి రాష్ట్ర అంతిమ వార్షిక ప్రణాళిక తుది మొత్తానికి అనుగుణంగా తిరిగి పునరుద్ధరించాలి.

అదే విధంగా, SCSP/TSP నిధి ఖర్చుని ఈ చట్టంలో తదుపరి నిర్దేశించిన పద్ధతిలో జమచేయాలి.

4. రాష్ట్ర షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక నిధికి అనుగుణంగా ప్రతి ప్రభుత్వ శాఖ ఏటా తగు ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇందుకు గాను ప్రభుత్వం అనుమతించిన ఓ శాఖ నిర్దేశించిన పద్ధతిలో అన్ని శాఖలకు ఆ సంవత్సరం ఈ నిధికి ఎంత మొత్తం కేటాయించబడే అవకాశం ఉందో అనే ముందస్తు అంచనాలను తెలియజేయాలి.

5. వివిధ ప్రభుత్వ శాఖలు తమ ఉపప్రణాళికల్లో రూపొందించే పథకాలు ఖచ్చితంగా లెక్కించగల మరియు నేరుగానూ, షెడ్యూల్డు కులాల, గిరిజనులకు చెందిన వ్యక్తులకు లేదా సమూహాలకు లేదా ప్రాంతాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండేట్లు చూసుకోవాలి. అవి వారి అభివృద్ధి అంతరాలను పూడ్చే విధంగా ఉండాలి మరియు ఈ చట్టం, ఈ చట్టానికి అనుబంధ నిబంధనలకు లోబడి ఉండాలి.
అయితే ఈ పథకాలు రూపొందించేటప్పుడు, ప్రణాళిక శాఖ తెలియజేసిన వార్షిక మరియు పంచవర్ష ప్రణాళికలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించాలి.

6. వివిధ ప్రభుత్వ శాఖలు షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికలను రూపొందించేటప్పుడు షెడ్యూల్డు కులాల, గిరిజనుల ప్రజా సమూహాల మధ్య అంతర్గత సమన్యాయం పెంపొందించేట్లుగా రూపొందించాలి. వెనుకబడిన షెడ్యూల్డు కులాల, గిరిజనుల నివాసాల పట్ల దృష్టి కేంద్రీకరించాలి. గిరిజనుల ఉపప్రణాళిక విషయంలో అయితే షెడ్యూల్డు ప్రాంతాల్లో నివసించే గిరిజనులపై దృష్టి సారించాలి.

7. ప్రభుత్వ శాఖలు ప్రస్తుతం కొనసాగుతున్న సాధారణ పథకాలలో వారివారి అర్హతలను బట్టి షెడ్యూల్డు కులాలు/ గిరిజనులకు తగు స్థానం కల్పించాలి.

8. ప్రతి ప్రభుత్వ శాఖ, సెక్షన్ 4లో చెప్పబడినటువంటి ఆదేశాలు అందిన తదుపరి, షెడ్యూల్డు కులాల/ గిరిజనుల అభివృద్ధి అంతరాలను అంచనా వేసి తదనుగుణంగా అభివృద్ధి అవసరాలను బేరీజు వేయాలి. ఈ ప్రక్రియ నిర్దేశించబడిన పద్ధతిలో అభిప్రాయ సేకరణ ద్వారా చేసి తదనుగుణంగా షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక పథకాలు రూపొందించుకోవాలి. తదనంతరం సెక్షన్ 5లో చెప్పబడినట్లు రాష్ట్ర ప్రణాళికా ప్రాధాన్యతలకు సంబంధించిన సమాచారం అందగానే తదనుగుణంగా షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికలను రూపొందించుకోవాలి.

9. ఈ చట్టం కింద ప్రత్యేకంగా ప్రకటించబడిన శాఖలు మినహా ఇతర ప్రభుత్వ శాఖలన్నీ ప్రతి ఏటా తమ శాఖలు ప్రతిపాదిస్తున్న షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/

గిరిజనుల ఉపప్రణాళిక పథకాలను నియమిత శాఖ పరిశీలించేందుకు వీలుగా పొందుపర్చి ఉపప్రణాళికలను తయారుచేసి నిర్దేశించబడిన నమూనాలో, కాలంలోగా నియమిత శాఖకు అందజేయాలి.

## అధ్యాయం - III

**10.** షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికలకై ఏర్పాటు చేయబడ్డ నియమిత శాఖ వివిధ శాఖల నుంచి అందిన షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక పథకాలు, గిరిజనుల ఉపప్రణాళిక పథకాలను పరిశీలించి అవి ఈ చట్టంలో నిర్దేశించబడ్డ షరతులు, నిబంధనలకు అనుగుణంగా ఉండేట్లు చూడాలి.

**11.** ఆ నియమిత శాఖ షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక నిధి మరియు గిరిజనుల ఉపప్రణాళిక నిధిని ఆయా షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక పథకాలకు కేటాయించేటపుడు ఈ కింది నియమాలు పాటించాలి:

(అ) కేవలం షెడ్యూల్డు కులాల/ గిరిజనులకు చెందిన వ్యక్తులు, కుటుంబాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే పథకాలయితే ఆ పథకాలకవసరమైన వందశాతం నిధిని షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక నిధి నుంచి కేటాయించి అందులో జమ చేయాలి.

(ఆ) షెడ్యూల్డు కులాల/ గిరిజనుల నివాస ప్రాంతాలకు ప్రయోజనం చేకూర్చే పథకాలయితే ఆ పథకాలకవసరమైన వంద శాతం నిధిని షెడ్యూల్డు కులాల/ గిరిజనుల ఉపప్రణాళిక నిధి నుంచి కేటాయించి అందులో జమ చేయాలి. ఇతర నివాస ప్రాంతాల విషయంలో అయితే అక్కడ నివసిస్తున్న షెడ్యూల్డు కులాల/ గిరిజన ప్రజల దామాషా కనుగుణంగా షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక నిధి నుంచి నిధులు కేటాయించి జమ చేయాలి.

(ఇ) ఉపప్రణాళికల్లో చేర్చబడిన ఇతర సాధారణ పథకాల్లో అనగా, షెడ్యూల్డు కులాల/ గిరిజనుల వ్యక్తులు, కుటుంబాలవారికే గాక ఇతరులకు కూడా ప్రయోజనం చేకూర్చే పథకాల్లో, అందుకవసరమైన నిధులని షెడ్యూల్డు కులాల/ గిరిజనుల లబ్ధిదారుల దామాషాకనుగుణంగా షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక నిధి నుంచి కేటాయించి జమ చేయాలి.

(ఈ) విభజనకు వీలుగాని మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనుల విషయంలో ఆ పథకానికవసరమైన నిధుల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కొంత భాగం ఖర్చును షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళికల కింద జరిగినట్లు భావించవచ్చు.

12. వివిధ శాఖల నుండి వచ్చిన పథకాలను సాంఘిక సంక్షేమానికి సంబంధించిన నియమిత శాఖ, గిరిజన సంక్షేమానికి సంబంధించిన నియమిత శాఖ పరిశీలించి, ఈ చట్టంలోని నిబంధనల కనుగుణంగానున్న పథకాలను ఆయా శాఖల వార్షిక ప్రణాళికల్లో ప్రతిపాదనలుగా చేర్చేందుకు సిఫార్సు చేయాలి. ఇలా అన్ని శాఖల్లో పొందుపర్చిన ప్రతిపాదనల్ని సమన్వయించి ఆ మొత్తాన్ని షెడ్యూల్డు కులాల మరియు గిరిజనుల అభివృద్ధి మండలి రాష్ట్ర బడ్జెట్ ముందుగా పరిశీలించి ఆమోదించేందుకై పంపాలి.

## అధ్యాయం - IV

13. షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక రాష్ట్రమండలిచే ఆమోదించబడిన బడ్జెట్‌ను ఆయా ప్రభుత్వ శాఖలు ఏటా సమర్పించే కేటాయింపులకై ప్రతిపాదనల్లో, సంబంధిత షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళిక అనే అంశం కింద చేర్చాలి.

14. ఈ చట్టం కింద బడ్జెట్ కేటాయింపులు, అమలు సంబంధించిన కార్యకలాపాలు నిర్వర్తించేందుకై ఆర్థిక శాఖలో ఓ ప్రత్యేక ఆర్థిక కార్యదర్శి ఉండాలి. అయితే ఇదంతా ఆర్థిక శాఖలోని సాధారణ ఆర్థిక వెసులుబాట్లు సంబంధించిన క్రమశిక్షణ పరిధిలోనే ఉంటుంది.

15. రాష్ట్ర శాసన సభలో బడ్జెట్ ఆమోదం పొందిన తక్షణమే, బడ్జెట్‌లో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజనుల ఉపప్రణాళికకై ప్రతిపాదించిన బడ్జెట్ మొత్తానికి ఆయా శాఖలకు బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీ చేయాలి.

## అధ్యాయం - V

16. (1) ఈ చట్టం అమలులోకి వచ్చిన పిదప సాధ్యమైనంత త్వరలో ఓ ప్రకటన ద్వారా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఓ రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి. ఈ మండలి "రాష్ట్ర షెడ్యూల్డు కులాల, గిరిజనుల అభివృద్ధి మండలి" అని పిలువబడుతుంది. ఈ చట్టంలో మరియు నిబంధనల్లో నిర్దేశించిన అధికారాలు, కార్యకలాపాలు ఈ మండలి నిర్వర్తిస్తుంది.

(2) ఈ రాష్ట్ర మండలి ఏడాదికి కనీసం రెండు సార్లయినా సమావేశం కావాలి.

17. ఈ రాష్ట్రమండలి–

(అ) షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికకు సంబంధించిన అన్ని విధాన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి;

(ఆ) ప్రభుత్వశాఖలు సరిగా పథకాలు రూపొందించి, అమలు చేసేందుకు తీసుకోవాల్సిన తగు చర్యలు గురించి సలహా ఇవ్వాలి;

(ఇ) అన్ని శాఖల నుంచి ప్రతిపాదించబడే వార్షిక షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికలను ఆమోదించాలి;

(ఈ) నిర్దేశించిన ఇతర కార్యకలాపాలు నిర్వర్తించాలి.

**18.** (1) నిబంధనల ప్రకారం, సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మరియు గిరిజన సంక్షేమశాఖా మంత్రి ఆధ్వర్యంలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళికల నియమిత సంస్థలను ఏర్పాటు చేయాలి, ఇవి ఈ చట్టంలో వాటికి నిర్దేశించబడిన అధికారాలు, కార్యకలాపాలు నిర్వర్తిస్తాయి.

(2) ఈ నియమిత సంస్థలు తమ అధికారాలు, కార్యకలాపాలు నిర్వర్తించటంలో సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ నియమిత శాఖలుగా ఉండి సహాయం చేయాలి.

**19.** ఈ నియమిత సంస్థలు ఆయా నియమిత శాఖల సహాయంతో:

(1) వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికలను పరిశీలించి అవి ఈ చట్టానికి అనుగుణంగా ఉండేట్లు చూడాలి.

(2) రాష్ట్ర షెడ్యూల్డు కులాల/ గిరిజనుల అభివృద్ధి మండలి పరిగణన, ఆమోదం కోసం రాష్ట్ర స్థాయిలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికలను సిద్ధం చేయాలి.

(3) షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళిక నిధులను ఒక శాఖ నుంచి మరో శాఖకు బదలాయించి కేటాయించేందుకు సిఫార్సు చేయవచ్చు.

(4) షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికల అమలు, పర్యవేక్షణ ఎలా జరుగుతుందో సమీక్షించాలి.

(5) అడ్డంకులను గుర్తించి అవి అధిగమించేందుకు చర్యలు సూచించాలి.

(6) రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికలను తయారు చేయటంలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలి.

(7) నిర్దేశించిన పద్ధతిలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికకు సంబంధించి ఈ కింది అంశాలు చూడాలి, అవి: ఖర్చు చేయటంలో పారదర్శకత, నిర్దేశించిన పద్ధతిలో, పథకాల వారీగా, జిల్లా వారీగా, గ్రామం వారీగా, లబ్ధిదారుల వారిగా వివరాలు నమోదు చేయటం; అమలు పురోగతి

గురించి, ఖర్చులు, ఏమి సాధించింది తద్వారా వచ్చిన ఫలితంలాంటి వివరాలు తెలియజేసే ఓ వెబ్‌సైట్‌ను నడపటం.

(8) షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/గిరిజన ఉపప్రణాళిక నిధులు ఎలా ఖర్చయిందీ పరిశీలించేందుకు సంవత్సరానికి కనీసం ఒక్కసారయినా సామాజిక తనిఖీ జరిగేట్లు చూడాలి. తద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్దేశించుకున్న అభివృద్ధి అంచనాలతో పోల్చినపుడు వాస్తవంలో జరిగిన మానవ అభివృద్ధి సూచిక గురించి విశ్లేషించుకునే అవకాశం కల్పించాలి.

నియమిత సంస్థ జారీచేసే ఆదేశాలకు అన్ని శాఖలు బద్ధులై ఉండాలి.

**20.** నియమిత సంస్థకు సహాయంగా ఉంటూ ఈ సంస్థ కార్యకలాపాలు, విధులు సజావుగా సాగేందుకు వీలుగా, నియమిత శాఖలయిన సాంఘిక సంక్షేమ శాఖను, గిరిజన సంక్షేమ శాఖను తగువిధంగా, నిర్దేశించిన రీతిలో బలోపేతం చేయాలి. అందుకై ఈ శాఖలకు పరిపాలన, సాంకేతిక సహాయ బృందాలను సమకూర్చాలి. అదే విధంగా ఓ ఉపప్రణాళిక పరిశోధన కేంద్రాన్ని కూడా సమకూర్చాలి.

**21.** షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/గిరిజన ఉపప్రణాళికలను సజావుగా నడిపేందుకు గుర్తించబడిన శాఖల ద్వారా ఓ ఉపప్రణాళిక సహాయ బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇది రాష్ట్ర మండలి నిర్దేశిత పద్ధతిలో చేస్తుంది.

**22.** (1) షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళిక అమలు పర్యవేక్షణకై ప్రతి జిల్లాలో జిల్లాస్థాయి పర్యవేక్షక మండళ్ళను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఈ మండళ్ళకు జిల్లా కలెక్టరు అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

(2) జిల్లా స్థాయి ప్రణాళికా సంఘాలు షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికల అమలును తరచుగా నిర్ణీత కాలంలో సమీక్షించాలి.

**23.** రాష్ట్ర, జిల్లా, ఉపజిల్లా స్థాయి బృందాలను బలోపేతం చేయటం ద్వారా అమలు, పర్యవేక్షణ సరిగా జరిగేట్లు చూసే బాధ్యత ప్రభుత్వం చేపట్టాలి. అందుకై ఆయా స్థాయిల్లో బృందాలకు తగు సూచనలు ఇవ్వటం, ఉద్యోగులను నియమించటం, వారికి శిక్షణలివ్వటం లాంటి చర్యలను నిర్దేశించిన పద్ధతిలో ప్రభుత్వం చేపట్టాలి.

## అధ్యాయం - VI

**షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళిక యొక్క అమలులో పారదర్శకత మరియు జవాబుదారీతనం.**

**24.** (1) షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజన ఉపప్రణాళిక పథకాల అమలు ప్రతి శాఖలోని అన్ని స్థాయిలలోను పారదర్శకత మరియు జవాబుదారీతనం ఉండునట్లు చూడవలెను.

(2) ప్రతి శాఖలోనూ సంబంధిత పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచవలెను.

**25.** ఈ చట్టం అమలుపరుచుటలో సంబంధిత అధికారులు పనితనాన్ని బట్టి ప్రోత్సాహకాలను, పనిని అశ్రద్ధ చేసినవారిపై తగు చర్యలు తీసుకునేటట్లు ప్రభుత్వం సరైన ఒక పథకాన్ని రూపొందించవలెను.

దీనికి సంబంధించి సంబంధిత ప్రభుత్వ అధికారులకు వర్తించే క్రమశిక్షణా నియమాల ద్వారా చర్యలు నిర్వహించవలెను.

**26.** నోడల్ ఏజెన్సీ ప్రతి ఆర్థిక సంవత్సరంలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళిక యొక్క అమలు ఫలితాలను శాఖలు వారిగా సాధించిన విజయాలను మరియు శాఖల వారీగా వినియోగించని నిధుల వివరాలతో కూడిన వార్షిక నివేదికను శాసన మండలి సమక్షంలో ఉంచవలెను.

**27.** (1) ఈ చట్టం ఇతర నిబంధనలకు లోబడి ప్రభుత్వం ఈ చట్టం ప్రయోజనాలన్నింటిని గాని లేక దేనినైనా గాని నెరవేర్చుటకు ప్రకటన ద్వారా నియమములు చేయవచ్చు.

(2) పైన చెప్పబడిన చట్టపు ప్రయోజనాలన్నింటిని గాని లేక ఏవేని విషయాలలో స్వలాభము చూసుకోకుండా నిబంధించవచ్చు. అవి:

అ) 2వ భాగంలో షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి సంబంధించిన ఆటంకాలను నిర్ధారించటం.

ఆ) 3వ భాగంలో ప్రణాళిక నిర్వహణ వేయముల నుండి షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళిక నిధులను ప్రత్యేకించటం.

ఇ) 8వ భాగంలో అన్ని శాఖలతో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళికల కింద పథకాలను గుర్తించి ఉపప్రణాళికలను తయారు చేయటం.

ఈ) 9వ భాగంలో నోడల్ శాఖలచే నిశ్చయించుట కొరకు షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళిక బడ్జెట్ ప్రతిపాదనను తయారు చేయటం.

ఉ) 14వ భాగంలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/ గిరిజన ఉపప్రణాళిక కింద వేయములను పర్యవేక్షించుటకు ఆర్థిక శాఖను పటిష్టపరచటం.

ఊ) 16వ భాగంలో షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల రాష్ట్ర అభివృద్ధి మండలి ఏర్పాటు మరియు కార్యక్రమాల నిర్వహణ, రాష్ట్ర మండలి అనధికార సభ్యుల అర్హత, అనర్హత మరియు ఇతర భత్యములు.

ఋ) 18వ భాగంలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళిక కొరకు నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేయటం.

ఋ) 19వ భాగంలో ఒక వెబ్ పోర్టల్‌ను నోడల్ ఏజెన్సీచే నిర్వహించటం.

ఎ) 20వ భాగంలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక/గిరిజన ఉపప్రణాళికల కొరకు సంబంధిత నోడల్ శాఖలో పరిపాలన మరియు సాంకేతికత సహాయక విభాగాన్ని ఏర్పాటు చేయటం.

ఏ) 21వ భాగంలో శాఖా స్థాయిలో ఉపప్రణాళిక సహాయక విభాగాన్ని ఏర్పాటు చేయటం.

ఐ) 22వ భాగంలో జిల్లా పర్యవేక్షణ కమిటీలను మరియు దానికి సంబంధించిన విషయములను ఏర్పాటు చేయటం.

ఒ) 23వ భాగంలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయుటకు, అవగాహన కల్పించుటకు, సామాజిక కార్యక్రమాలను, సామాజిక తనిఖీ మరియు పర్యవేక్షణను చేసేటట్లు చూడడానికి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి మరియు ఉపజిల్లా స్థాయిలలో సంస్థాగతంగా పటిష్టవంతం చేయటం.

ఓ) 24వ భాగంలో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, గిరిజన ఉపప్రణాళికల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేటట్లు చూడటం కోసం విధానాలు రూపొందించటం.

3. ఈ చట్టం కింద చేసిన ప్రతి నియమమును రాష్ట్ర శాసన మండలిలో 14 రోజుల పాటు ప్రవేశపెట్టటం. వ్యవధి చాలనిచో రెండవ దఫా ప్రవేశపెట్టవలెను. నియమములలో ఏదైనా మార్పు చేయుటకు లేదా రద్దు చేయుటకు అంగీకరించినచో ఆ మార్పు లేక రద్దు చేసిన తేదీ నుండి అమలు కలిగి ఉండును లేదా రద్దగును. అయితే అట్టి మార్పు లేక రద్దువలన ఆ నియమం కింద అంతకు పూర్వం చేయబడిన ఏ శాసనంకైనను భంగం కలిగించదు.

**28.** (1) ఈ చట్టం నిబంధనలను అమలు పరచటంలో ఏ విధమైన అడ్డంకులు వచ్చినా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఈ చట్టపు నిబంధనలకు ఇబ్బంది లేకుండా ఆ చిక్కును తొలగించుటకు ఆవశ్యకమని లేదా సముచితమని తమకు తోచినట్లు నిబంధనలను లేక ఆదేశములను చేయవచ్చును.

ఈ చట్టం ప్రారంభమైన తేదీ నుండి 2 సంవత్సరాల వ్యవధి గడిచిన పిమ్మట ఆ అధికారమును వినియోగించరాదు.

(2) ఈ భాగం కింద చేసిన ప్రతి ఉత్తర్వును చేసిన వెంటనే రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమక్షంలో ఉంచవలెను.